క్లుప్తంగా

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్టుకు సోమవారం బెంగళూరుకు చెందిన దాత గోపాల్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దే వైద్యం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కింద ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత తెలిపారు. సోమవారం మండలంలోని తిమ్మాపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించారు. అనంతరం మంచాన పడిన రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్సలందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరళ, శిల్ప, సరిత, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

కార్పొరేషన్ 'గ్రీవెన్స్'కు 7 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వివిధ సమస్యలపై 7 వినతులు వచ్చినట్లు కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం గతవారం అందిన వినతులపై సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్ఓ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: నగరంలోని కలెక్టర్ బంగ్లాలో ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం ఉదయం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ భూమి పూజ చేశారు. నగరంలో రహదారుల విస్తరణ కోసం కలెక్టర్ బంగ్లాకు సంబంధించిన స్థలం కేటాయించారు. ఈ నేపథ్యంలో లోపల మరో ప్రహరీ గోడ నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ బోడబండ వద్ద ఆదివారం రాత్రి బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు గణశ్యామ్(30) స్థానిక పైపుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అతను విధులు ముగించుకుని పుంగనూరుకు నడిచి వెళ్తున్నాడు. బోడబండ వద్ద పుంగనూరుకు బైక్‌లో వెళ్తున్న అమర్‌సాగర్ (26) ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గన్శ్యామ్‌ను వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈశ్వరునికి ఘనంగా అన్నాభిషేకం

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివాలయంలో సోమవారం ఈశ్వరునికి అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మునిరాజశర్మ వేద మంత్రాలతో అన్నాభిషేకం, పంచామృతాభిషేకాలు, అభిషేకం వంటి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఐదు సోమవారాలు అన్నాభిషేకం చేస్తే ఆ కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వారణాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, రజిత దంపతులు వ్యవహరించారు.

గ్రామీణ రోడ్లకు గ్రహణం

- అడుగడుగునా గుంతలమయం
- ప్రమాదకరంగా ప్రయాణం
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- రాకపోకలకు తప్పని తిప్పలు

ఐరాల మండల కేంద్రంలో గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసే రోడ్లకు గ్రహణం పట్టింది. గుంతలమయంగా మారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. సంక్రాంతి లోపు అన్ని మార్గాలను అద్దంలా మారుస్తామని సర్కారు ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఇప్పటికీ క్షేత్రస్థాయిలో రాకపోకలకు ఇబ్బందులు తప్పని దుస్థితి దాపురించింది. రాళ్లు తేలిన రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారిపోయింది. పల్లె ప్రజానీకం గాయాలపాలవుతోంది.



నీటి కుంటలా గోవిందరెడ్డిపల్లె రోడ్డు

ఐరాల: సంక్రాంతిలోపే రాష్ట్రంలోని రోడ్లన్నీ బాగు చేస్తామని గతంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అటకెక్కింది. సంక్రాంతి పండుగ పోయి ఆరు నెలలు కావస్తున్నా గ్రామీణ రోడ్ల పరిస్థితిలో ఏ మార్పులేదని పల్లెవాసులు వాపోతున్నారు. ప్రధానంగా ఐరాల మండలంలోని నాగంవాండ్లపల్లె, గోవిందరెడ్డిపల్లె, వినాయకపురం వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే రహదారులను బీటీ రోడ్లుగా గత ప్రభుత్వంలో మార్చారు. అయితే ఏడాదిగా కూటమి ప్రభుత్వం మాత్రం కనీసం రహదారులు మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో రోడ్లు పూర్తిగా కంకరమయంగా మారిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయి పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

సర్కారు వైఫల్యం

మీఎస్.అగ్రహారం నుంచి నాగంవాండ్లపల్లెకు వెళ్లే మార్గం మరింత అధ్వానంగా మారింది. సుమారు 4 కిలోమీటర్ల మేర ఉండే ఈ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. దీంతో ఈ దారిలో ప్రయాణం చేసే ఐదు గ్రామాల విద్యార్థులు, వాహనదారులు ప్రతి రోజూ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం నుంచి గోవిందరెడ్డిపల్లె, వినాయకపురం వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మండల కేంద్రం నుంచి 6 ఆరో కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే ఈ రోడ్డులో రాకపోకలు అధికంగా ఉండడంతో దెబ్బతింది. అడపాదడపా వర్షాలకు పూర్తిగా కంకర, తారు లేచిపోయి రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డులో దగ్గరకు వచ్చే వరకు గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ రోడ్లను మరమ్మతులు చేస్తామని, అవసరమైన చోట్ల రోడ్లు నిర్మిస్తామని హామీలు ఇచ్చిందే తప్పా అమలు చేయడంలో వైఫల్యం చెందిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కంకర తేలిన వినాయకపురం రోడ్డు



నాగంవాండ్లపల్లె రోడ్డు దుస్థితి

నేడు వైఎస్సార్ జయంతి

చిత్తూరు కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం చిత్తూరు నగరంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఉదయం 9.30 గంటలకు డీసీసీ బ్యాంకు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నారు. అనంతరం 11.30 గంటలకు సంతపేట సర్కిల్ వద్ద మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టనున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పాల్గొననున్నారు.

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఉదయం 8 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం కేక్ కట్ చేస్తామని చెప్పారు.వేడుకలకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలిరావాలని కోరారు.

ప్రతి పాఠశాలలో పేరెంట్స్.. టీచర్ల మీటింగ్

తవణంపల్లె: మండలంలోని ప్రతి పాఠశాలలో పేరెంట్స్, టీచర్ల సమావేశం నిర్వహించాలని ఎంఈఓ హేమలత ఆదేశించారు. సోమవారం తవణంపల్లె ఎంఆర్‌సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులకు ముందస్తుగా ఆహ్వానపత్రికలు అందించాలని సూచించారు. మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

చరిత్రలో నిలిచేలా జగనన్న పర్యటన





యాదమరి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తవణంపల్లెలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

యాదమరి/తవణంపల్లె/ఐరాల: మామిడి రైతులకు అండగా నిలిచేందుకు బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వస్తున్న ప్రజా నేత జగనన్న పర్యటన చరిత్రలో నిలిచిపోవాలని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం యాదమరి, తవణంపల్లె, కాణిపాకంలో ఆయన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బుధవారం మామిడి మార్కెట్‌కు జగనన్న రానున్నట్లు వెల్లడించారు. రైతుల కష్టాలను నేరుగా తెలుసుకోనున్నట్లు వివరించారు. గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీరు పెడుతుంటే కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. జగనన్న పర్యటనతో రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దగాపై ప్రజలే దండయాత్ర చేయాలని పిలుపునిచ్చారు. రైతన్నలు అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడుతుంటే చంద్రబాబు కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. జగనన్న పర్యటనకు పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. యాదమరి సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోనాపల్లి మనోహర్, వైస్ ఎంపీపీలు హరనారాయణ రెడ్డి,రవీంద్రబాబు,మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే తవణంపల్లె సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హరిరెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి, పార్టీ నేతలు హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, రవిరెడ్డి, మధుకుమార్, ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వరరెడ్డి, కిషోర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, భాస్కర్‌నాయుడు, వరప్రసాద్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, జనార్ధన్‌యాదవ్, కోదండ,హరిప్రసాద్ రెడ్డి, పట్టాభిరెడ్డి, మోహన్‌రెడ్డి, దూర్వాసులు రెడ్డి, హేమచంద్ర, విజయకుమార్ రెడ్డి, మురుగన్, పరదేశి, చిట్టిబాబు, సుధాకర్, హరిరెడ్డి, పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు. అలాగే కాణిపాకం సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాన వేతనమే లక్ష్యం



మాట్లాడుతున్న సుధాకర్ తదితరులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విద్యుత్ శాఖలో సమాన పనికి సమాన వేతనం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేత సుధాకర్ తెలిపారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు కొన్నేళ్లుగా అవస్థలు పడుతున్నారన్నారు. విపత్తులు వచ్చినప్పుడు మాత్రమే తాము గుర్తుకొస్తున్నామని, తర్వాత పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా దళారీ వ్యవస్థను రూపుమాపాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ దళారీ వ్యవస్థను రూపు మాపుతూ విప్లవాత్మక చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఏపీలో కూడా విద్యుత్ శాఖలో ప్రక్షాళన చేపట్టాలని, లేకుంటే ఆగస్టులో తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మనీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు హేమ కుమార్, రూప్ కుమార్, శరవణ, అంకయ్య, రుద్రేశ్, రజని పురుషోత్తంవర్మ పాల్గొన్నారు.

ఆగస్టు 9 నుంచి సీపీఐ మహాసభలు



మాట్లాడుతున్న రామానాయుడు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు సీపీఐ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామానాయుడు తెలిపారు. సోమవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. వామపక్ష ఉద్యమాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సకల విధాలుగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సన్నద్ధం కావాలని కోరారు. కార్పొరేట్‌కు కొమ్ముకాసే కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక కోడ్లను నాలుగుకి కుదించడం, పని గంటలు పెంచడం దుర్మార్గమన్నారు. ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలు నేటికీ అమలు చేయకపోవడం అన్యాయ మని మండిపడ్డారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, సహాయ కార్యదర్శి జనార్దన్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు విజయగౌరీ, గోపీనాథ్, కోదండ, రమాదేవి, చంద్ర, మనీ, జయలక్ష్మి,సత్యమూర్తి, రఘు, బాలాజీ రావు, విజయకుమార్, రామ్మూర్తి, కుమారి, వేలన్, మంజు నాథ్ బాబు, గురప్ప, జయకుమారి పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మామిడి రైతుల సంక్షేమ సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని మామిడి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, రామానాయుడు డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో మామిడి రైతులకు పెట్టిన పెట్టుబడి సైతం అందడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.12 గిట్టుబాటు ధరను పకడ్బందీగా అమలు చేసి రైరులకు న్యాయం చేయాలన్నారు. నిర్ణయించిన విధంగా గిట్టుబాటు ధరను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈనెల 25న రైతులకు చెల్లింపులు మొదలుపెట్టాలని కోరారు. నేతలు ఆనందనాయుడు, జనార్దన్, హరిబాబుచౌదరి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

పలమనేరు: పలమనేరు మండలంలోని పీహెచ్‌సీలను సోమవారం ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేశారు. కొలమాసనపల్లి ఆరోగ్య కేంద్రంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలను చేశారు. ప్రబలిన జ్వరాలు అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జ్వరాలు వచ్చిన రోగులు ఆస్పత్రికి రాగానే వారి నుంచి రక్త నమూనాలు సేకరించి ఫలితాల మేరకు చికిత్స చేయాలని ఆదేశించారు. మలేరియా జ్వరం పాజిటివ్ వచ్చిన రోగుల వివరాలను మెడికల్ ఆఫీసర్‌కు తెలపాలన్నారు. ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారుల నుంచి చర్యలు తప్పవని ఆయన సూచించారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ



పుంగనూరులో హాస్టల్ పనులను పరిశీలిస్తున్న మునీంద్రనాయక్

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని బాలురు, బాలికలు, గిరిజన, కాలేజ్ సాంఘీక సంక్షేమ శాఖ హాస్టళ్లను సోమవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ తనిఖీ చేశారు. పనులను పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వున్న హాస్టళ్లలో రూ.13 కోట్లతో రీమోల్డింగ్ పనులు చేస్తున్నట్టు తెలిపారు. తమ పరిశీలనలో గుర్తించిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అయూబ్‌ఖాన్, శ్రీరాములునాయక్, అధికారులు పాల్గొన్నారు.

మా పొలాలకు దారి చూపండి



దారి ఏర్పాటు చేయాలని అధికారులను ప్రశ్నిస్తున్న బాధిత రైతులు

గంగవరం: కూటమి ప్రభుత్వంలో అర్హులకు న్యాయం జరగడం లేదని, ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులకే అధికారులు పనులు చేసి పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, అదే కూటమి సానుభూతిపరుడైన రైతుకు వెంటనే దారి సౌకర్యం కల్పించారని మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గంగవరం మండలంలోని కీలపట్ల పంచాయతీ జరావారిపల్లెలో రైతుల పొలాల వద్దకు వెళ్లేందుకు దారి లేక కొన్నేళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్య రైతులందరూ తమ పొలాలకు దారి సౌకర్యం కల్పించాలంటూ తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. అయినా పట్టించుకోలేదు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత వీరభద్ర పొలానికి సైతం ఇక్కడే దారి సమస్య ఉంది. తన సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ అధికార పార్టీ పెద్దల నుంచి తహసీల్దార్‌కు ఫోన్ చేయించాడు. ఈ క్రమంలో తహసీల్దార్ మాధవరాజు ఆగమేఘాల మీద ఆ రైతు పొలానికి దారి కల్పించేందుకు జరావారిపల్లెకుకి చేరుకున్నారు. ఆ రైతు సమస్యను మాత్రమే పరిష్కరించి వెళ్లిపోయారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. దారి ప్రారంభంలో వచ్చే రైతు రామక్రిష్ణ భూమిని కొంత బలవంతంగా లాక్కుని జేసీబీతో తవ్వకాలు చేసి వీరభద్ర పొలానికి దారి చూపించి రెవెన్యూ అధికారులు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అదే విధంగా ఇదే దారిలోనే నూతనంగా వెలసిన వీరభద్రస్వామి ఆలయానికి సైతం చేరుకోవాల్సి ఉంది. బాధిత రైతులతో పాటు దేవుని ఆలయానికి కూడా దారి సమస్య ఉన్నా తమకు పట్టనట్టు అధికారుల వ్యవహరించడం సరికాదన్నారు. టీడీపీ నేత భూమి నుంచి దాదాపు 50 మందికి పైగా రైతులు తమ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాల్సి ఉంది. దీనిపై తహసీల్దార్ పట్టించుకోకపోవడం దారుణమని దుయ్యబట్టారు. ఈ క్రమంలో రైతులు, రెవెన్యూ సిబ్బంది మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పేదల పక్షాన నిలబడాల్సిన పాలక పక్షం తమ వారి వరకే చూసుకుంటున్నారని, అందరికీ న్యాయం చేయడం లేదని రైతులు వాపోతున్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



విద్యార్థులకు అక్షరాభాస్యం చేస్తున్న హెచ్ఎం సురేఖ


బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అక్షరాభాస్యం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పాఠశాలలో శ్రీ సరస్వతీ దేవి పూజ చేపట్టి విద్యార్థులతో హెచ్ఎం సురేఖ అక్షరాలు దిద్దించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

సింహ వాహనంపై కోదండరాముడు

తవణంపల్లె: టి.పుత్తూరులోని కోదండరామస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సింహవాహన సేవ నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉభయకర్తల చేతులమీదుగా స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించారు. సాయంకాలం ఆలయంలో ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంవగా స్వామివారికి గజమాలలు, సుగంధద్రవ్యాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలను ఉభయకర్తలు ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రిలో సింహ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు హనుమ వాహన సేవ

మంగళవారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై విహరించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వర రెడ్డి తెలిపారు.



సింహ వాహనంపై విహరిస్తున్న కోదండరాముడు



ఊంజల్‌సేవలో భక్తులు



పూజా సామగ్రి తీసుకువస్తున్న ఉభయకర్తలు